క్లుప్తంగా

ఢిల్లీ విద్యాశాఖ డైరెక్టర్‌గా వేదిత



వేదితతో తల్లి, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: నార్త్ ఢిల్లీ కలెక్టర్‌గా పనిచేస్తున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె రెడ్డి వేదితను అక్కడి ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. వేదిత ఐఏఎస్ పూర్తి చేసిన తర్వాత ఢిల్లీ మున్సిపల్ కమిషనర్‌గా, అండమాన్, నార్త్ ఢిల్లీ కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌గా నియమితులయ్యారు. వేదిత తండ్రి దివంగత రెడ్డి నాగభూషణరావు పలువురు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ స్పీకర్ల వద్ద, పలు రాష్ట్రాల్లో కీలక బాధ్యతలను నిర్వహించి గుర్తింపు తెచ్చుకున్నారు. తండ్రి బాటలోనే కుమార్తె వేదిత ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ సందర్భంగా వేదితను మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతితో పాటు పలువురు నాయకులు శుక్రవారం అభినందించారు.

రీ నోటిఫికేషన్‌పై హర్షం

సారవకోట: సమగ్ర శిక్ష అభియాన్ ఇచ్చిన పాత నోటిఫికేషన్‌ను మార్చి మరలా కొత్త నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఆదివాసీలకు అన్యాయం జరిగిందన్నారు. దీనిపై జాతీయ ఆదివాసీ సంక్షేమ పరిషత్ తరుపున జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో, మరలా రీ నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఆదివాసీలకు అన్యాయం జరిగితే వారి తరుపున తాము ముందుండి పోరాటం చేస్తామన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



శ్రీముఖలింగంలో వసతి గృహం పరిశీలిస్తున్న జడ్జి ప్రసన్నలత

జలుమూరు: వసతి గృహాల్లోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోటబొమ్మాళి జూనియర్ న్యాయసేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి బీఎం ప్రసన్నలత అన్నారు. శ్రీముఖలింగం బాలుర బీసీ, జలుమూరు బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహాలను శుక్రవారం సందర్శించి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. శ్రీముఖలింగంలో విద్యార్థులకు కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంపై వార్డన్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల సౌకర్యాలతోపాటు వారి విద్యా బోధన ఎలా సాగుతోందని అడిగారు. ఆమెతోపాటు వసతి గృహం అధికారి రమణ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు సిర్ల ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. సీహెచ్‌సీలో శానిటేషన్ కార్మికులతో శుక్రవారం మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు నెలకు రూ.16 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగా సెలవులు మంజూరు చేయాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలు సక్రమంగా అమలు చేయాలన్నారు. యూనిఫారాలు, షూలు, మాస్క్‌లతో పాటు ఆరోగ్యానికి అవసరమైన రక్షణ వస్తువులు సరఫరా చేయాలని కోరారు. పనిభారం ఎక్కువగా ఉన్నందున పనికి తగిన సిబ్బందిని పెంచాలని కోరారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ధర్మాన కిషోర్‌కు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు విజయకుమారి, లక్ష్మీ, మాలతి, వెంకటేష్, భవానీల తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుడి దాడి

హిరమండలం: శ్రీకాకుళం ఆర్టీసీ డిపో బస్సు డ్రైవర్‌పై యువకుడు శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. కొత్తూరు నుంచి శ్రీకాకుళం వెళ్లే ఆర్టీసీ బస్సు బ్యారేజీ సెంటర్లో ప్రయాణికులు ఎక్కి, దిగిన తర్వాత ముందుకు కదిలింది. ఆ సమయంలో ఒక వ్యక్తి చేయి ఎత్తినా ఆపలేదనే ఆగ్రహంతో బస్సును వెంబడించి హిరమండలం బస్టాండ్‌లో ఆగి ఉన్న బస్సు డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డాడు. దీనిపై డ్రైవర్, కండక్టర్లు పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తుండగా, అదే సమయంలో కొంతమంది పెద్ద మనుషులు ఇరువురిని రాజీ చేశారు. ఇదే విషయాన్ని ఎస్ఐ మహ్మద్ యాసిన్ అడగగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కిట్టాలపాడులో పొలంబడి

హిరమండలం: మండలంలోని కిట్టాలపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయికి వెళ్లి పంట పొలాలు పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై పంటల సంరక్షణ చర్యలు, నూతన సాగు పద్ధతులు, అధిక దిగుబడులకు అనుసరించాల్సిన సాగు విధానాలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

డిజిటల్ జోరు..!



- సర్వం సెల్‌ఫోన్ మయం
- యూపీఐ పేమెంట్స్‌కు ఆదరణ
- పెరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు

గతంలో ఇంటి నుంచి బయటకు వచ్చే ముందు జేబులో పర్సు పెట్టుకొని వచ్చేవాళ్లం. కానీ ఇప్పుడు కాలం మారింది. సాంకేతికత పెరిగి పట్టణాలు దాటి పల్లెల్లోకి చొచ్చుకు వస్తోంది. వినియోగదారుడి చేతిలో చిల్లిగవ్వలేకపోయినా డెబిట్, క్రెడిట్ కార్డులు లేకపోయినా పర్వాలేదు. చేతిలో సెల్‌ఫోన్ అందుబాటులో ఉండి, ఖాతాలో డబ్బుంటే చాలు కావాల్సినవి కొనుక్కోవచ్చు. బడ్డీ కొట్టులో సింగల్ టీ మొదలుకొని మాల్స్ వరకు, మార్కెట్‌లో కూరగాయలు నుంచి జ్యూయలరీ దుకాణంలో కొనుగోళ్ల వరకు డిజిటల్ పేమెంట్లే ఎక్కువగా జరుగుతున్నాయి. ఇప్పుడు క్యూ ఆర్ కోడ్ లేకుండా ఏ వ్యాపారీ కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు. అంతలా ప్రపంచమంతా డిజిటల్ బాటలో పయనిస్తోంది. - హిరమండలం



దుకాణం వద్ద డిజిటల్ పేమెంట్ చేస్తున్న వినియోగదారుడు

పల్లెల్లో సైతం

ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ చివరకు తోపుడు బండ్లు, గంపలపై పండ్లు అమ్ముకునే చిన్నచిన్న వ్యాపారులు కూడా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌ల సాయంతో ఆన్‌లైన్ లావాదేవీలు సులభంగా చేస్తున్నారు. తక్కువ సమయంలో సురక్షితమైన చెల్లింపులు జరుగుతుండడంతో వీటికి ఆదరణ లభిస్తోంది. కిరాణా, నిత్యవసర సరుకులు, పెట్రోల్ తదితర సామగ్రి మొదలుకొని మొబైల్, డీటీహెచ్, కేబుల్ రీచార్జ్‌లు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, బీమా, రుణాలు చెల్లింపులు, నగదు బదిలీలు తదితర అవసరాలన్నింటికీ వీటికే ఉపయోగిస్తున్నారు.

చిల్లర సమస్యకు పరిష్కారం

డిజిటల్ చెల్లింపుల ద్వారా చిల్లర సమస్యకు పరిష్కారం దొరికినట్లయ్యింది. గతంలో తక్కువ మొత్తంలో కొనుగోలు చేసి పెద్దనోట్లు ఇస్తే చిల్లర ఇచ్చేందుకు దుకాణదారులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఎక్కడ చూసినా యూపీఐ, ఫోన్‌పే ద్వారా పేమెంట్ చేస్తుండడంతో అటు వినియోగదారుడికి, ఇటు వ్యాపారికి ఇబ్బందులు తప్పాయి. దీంతో దాదాపు 70 శాతం మంది డిజిటల్ విధానంలోనే లావాదేవీలు చేపడుతున్నారు.

బ్యాంకుల్లోనూ...

బ్యాంకుల్లో సైతం డిజిటల్ లావాదేవీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గిపోయాయి. ఎవరకి ఎలాంటి అవసరమొచ్చినా నేరుగా బ్యాంకు నుంచే అవతలి వ్యక్తి ఖాతాలకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. సగటున ఒక్కో బ్యాంక్ పరిధిలో రోజుకు సుమారు రూ.8 లక్షల వరకు ఆన్‌లైన్ పేమెంట్లు జరుగుతున్నట్లు సంబంధిత బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ క్రమంలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

చెల్లింపులు సులభమయ్యాయి



ఫోన్ పే అందుబాటులోకి వచ్చిన క్రమంలో ఈ తరహా చెల్లింపులు అధికంగా జరుగుతున్నాయి. మాకు చిల్లర బెడద తగ్గింది. చేతితో నగదు తీసుకెళ్లాల్సిన పనిలేదు. చెల్లింపుల్లో జవాబుదారీతనం ఉంది. వినియోగదారులకు, మాకు ఈ విధానం ఎంతో సులభతరం. క్యూ ఆర్ కోడ్ ఉపయోగించి చెల్లింపులు చేయడం తేలికైంది.

- రెడ్డి భాగ్యలక్ష్మి, టిఫిన్ సెంటర్ వ్యాపారి, ఎల్ఎన్‌పేట

జాగ్రత్తలు తప్పనిసరి



డిజిటల్ చెల్లింపుల్లో అవసరమైన జాగ్రత్తలపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా సైబర్ నేరాలపై చైతన్యవంతం కావాలి. ఫోన్ పే చెల్లింపుల సమయంలో సీక్రెట్ కోడ్ ఇతరులకు ఇవ్వరాదు. తెలియని వ్యక్తులు, బ్యాంక్ సిబ్బంది పేరిట వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించకూడదు. ఒకవేళ స్పందించినా ఓటీపీ నంబర్లు చెప్పకూడదు.

- మహ్మద్ యాసిన్, ఎస్ఐ, హిరమండలం

కక్ష సాధింపు చర్యలు సరికావు

- జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



మాట్లాడుతున్న కృష్ణ చైతన్య తదితరులు

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మండిపడ్డారు. మండలంలోని చేనులవలసలో పోలీసు బందోబస్తు నడుమ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లబ్బ గోపాలరావు, లబ్బ కాశియ్యల అనుభవంలో ఉన్న స్థలాన్ని రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకోవడంపై శుక్రవారం తీవ్రంగా స్పందించారు. నాయకులకు అధికారులు వంత పాడుతున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేయడం సరికాదన్నారు. గత ఎన్నికల్లో చేనులవలస పోలింగ్ కేంద్రంలో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ రావడాన్ని కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్య పడవద్దని సూచించారు. లబ్బ గోపాలరావు, లబ్బ కాశియ్యలను పరామర్శించారు. ఆయనతో పాటు ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, వీఎస్‌పురం, యారబాడు సర్పంచ్‌లు పుట్టా ఆదిలక్ష్మి, యాబాజి రమేష్, నాయకులు రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల ఆందోళన



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏజెంట్లు

నరసన్నపేట: తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఎల్ఐసీ ఏజెంట్లు ఆందోళన బాట పట్టారు. దీనిలో భాగంగా శుక్రవారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద లంచ్ సమయంలో ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా నరసన్నపేట బ్రాంచి ఏజెంట్ల సంఘం కార్యదర్శి ఉప్పాడ పూర్ణారావు మాట్లాడుతూ పాలసీదారుల బోనస్ పెంచాలని, క్లా బ్యాక్ క్లాజుని రద్దు చేయాలని, బీమా పాలసీలు పాత పద్ధతి ప్రకారం లక్ష పాలసీ నుంచి కంటిన్యూ చేయాలని డిమాండ్ చేశారు. పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. ఈవిధంగా పలు డిమాండ్లు ఉన్నాయని, వీటిని ఎల్ఐసీ సంస్థ త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఆలిండియా లియాఫీ యూనియన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. సమస్యలు పరిష్కరించే వరకూ బ్రాంచిలో నూతన వ్యాపారం చేయవద్దని తీర్మానించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గడ్డెను, మెండ చిన్నావాడు, బోయిన కొండలరావు, జి.లక్ష్మీనారాయణ, గొలివి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై ఆందోళన



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు

పాతపట్నం: పాతపట్నం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్(మెళియాపుట్టి)లో 7వ తరగతి చదువుతున్న సవర లావణ్య మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై శుక్రవారం రాత్రి స్కూల్ ముందు ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సిగిలిపల్లి మదన్ కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం వలనే విద్యార్థిని మృతి చెందిందని మండిపడ్డారు. మృతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాతపట్నం కన్వీనర్ సంతోష్, ఏబీవీపీ సభ్యులు పాల్గొన్నారు. ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.


గోతులమయం



కొత్తూరు మండలంలోని గులుమూరు – నివగాం రోడ్డు గోతులమయంగా మారింది. కొత్తూరు నుంచి హిరమండలానికి అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు నివగాం గ్రామం నుంచి అంగూరు గ్రామం వరకు అధ్వానంగా ఉంది. దీంతో ఈ రహదారిలో ప్రయాణం చేయాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఆదమరిస్తే ప్రమాదాలు జరుగుతాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని సోమరాజపురం, అంగూరు, మదనాపురం తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- కొత్తూరు

గట్లపై చిక్కుడు సాగు



సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట పొలాల గట్లపై చిక్కుడు సాగు విస్తారంగా జరుగుతోంది. సారవకోట, జగ్గయ్యపేట, బద్రి, గోపాలపురం, లక్ష్మీపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో చిక్కుడు సాగుచేస్తూ రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. రైతులు ఇలా గట్లపై సాగు చేయడం వలన మేలు జరుగుతుందని అధికారులు సూచిస్తున్నారు. దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

- సారవకోట

ఆస్పత్రి స్లాబ్ లీకేజీ



నరసన్నపేట వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో స్లాబ్ పిల్లర్సు వద్ద వర్షం పడితే నీరు కారుతోంది. దీంతో ఫ్లోర్ తడిచిపోకుండా ప్లాస్టిక్ డబ్బాలను పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఆస్పత్రి రెండు ఫ్లోర్ల నిర్మాణం చేపట్టగా, కొత్తగా మూడో ఫ్లోర్ వేశారు. ఇది వర్షానికి కారుతోంది. దీనిపై ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి వర్గాలు కోరుతున్నాయి. రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి ఇబ్బంది లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- నరసన్నపేట

మరుగునపడి



మేజర్ పంచాయతీ హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న మరుగుదొడ్లకు తాళం వేసి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదివరకు ఈ మరుగుదొడ్లను ప్రయాణికులతో పాటు మేజర్ పంచాయతీలోని వర్తకులు, ప్రజలు వినియోగించుకునేవారు. అయితే గత కొద్ది నెలలుగా వీటిని ఎవరూ వినియోగించకుండా తాళాలు వేశారు. ఫలితంగా ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. అందువలన తక్షణమే వీటిని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- హిరమండలం

విద్యార్థుల్లో నైపుణ్యత పెంచడానికి శిక్షణ



మాట్లాడుతున్న సూర రామచంద్రరావు

ఆమదాలవలస: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి, పోటీ పరీక్షలకు సరైన శిక్షణ అందజేస్తే విజయం సాధించగలరని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్ భజన మండలి, ఆ ప్రాంతంలో సత్యసాయి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కంప్యూటర్ శిక్షణ తరగతులు ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నిమిత్తం ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు జిల్లాలో తొమ్మిది ప్రాంతాల్లో శాశ్వతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సత్యసాయి లక్ష్మీనగర్ సంస్థ ఆధ్వర్యంలో 250 మంది మహిళలకు మగ్గం వర్క్ టైలరింగ్, అంబ్రాయిడింగ్ ఫ్యాషన్ డిజైనింగ్, 45 మంది విద్యార్థులకు వేసవి శిక్షణను ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ప్రతినిధులు మునగవలస రవీంద్రబాబు, డాక్టర్ పి.తాతయ్యలు, సాయికృష్ణ, ఎస్.వాసు, టి.బంగారురాజు, ధర్మారావు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమ నిర్మాణంపై దర్యాప్తు



దర్యాప్తు నిర్వహిస్తున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అధికారుల కళ్లుగప్పి ప్రభుత్వ స్థలంలోనే ఏకంగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి శుక్రవారం దర్యాప్తు చేశారు. గ్రామస్తులు, అధికారుల సమక్షంలో వివరాలు సేకరించారు.

సర్వే నంబర్ 291లో 8 సెంట్ల స్థలం గ్రామ సచివాలయం నిర్మాణానికి అధికారులు కేటాయించారని, ఆ స్థలంలో రెండు సెంట్ల స్థలాన్ని ఒక వ్యక్తి ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. నిర్మాణం ప్రారంభంలోనే పలువురు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ నిర్మాణాన్ని ఆపాలని అధికారులు నోటీసులిచ్చినా, ఖాతరు చేయకుండా రాత్రి వేళల్లో నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. విలువైన ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్నా అడిగేవారే లేకపోయారని వాపోయారు. 2023 ఏప్రిల్ 18న నాలుగు వారాల్లో కలెక్టరేట్‌కు హాజరుకావాలని సూచించినా ఆక్రమణదారులు స్పందించలేదన్నారు. అనంతరం మెళియాపుట్టి మండల కేంద్రంలోని జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బడే పాపారావు, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి'

మెళియాపుట్టి: ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావడానికి ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మండలంలోని పలువురు మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని ఏపీఎం త్రినాథమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఆవరణలో పలువురు గ్రామ సంఘాల మహిళలకు శుక్రవారం అవగాహన కల్పించారు. మండలవ్యాప్తంగా వీరికి చదువు నేర్పించడానికి 111 మంది వలంటీర్లను ఎంపిక చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

జలుమూరు: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసేందుకు ఉల్లాస్ సర్వేను ఇంటింటా నిర్వహించాలని ఎంపీడీవో కొమరాపు తిరుపతిరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖలు, సచివాలయ సిబ్బందితో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే ఆయాలు, మిడ్డేమీల్స్‌లో పనిచేసేవారితో పాటు ఇతరులను గుర్తించి, వారిని ఆరు నెలల్లో అక్షరాస్యులుగా చేయడమే పథకం ఉద్దేశమన్నారు. దీనికోసం పది మందికి ఒక చదువుకున్న వ్యక్తిని నియమించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు మండల పరిషత్ సమావేశం

హిరమండలం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బూర్జ: లాభాం గ్రామం దగ్గర నారాయణపురం వంతెనపై టిప్పర్ అదుపు తప్పి వంతెనపై ఉన్న రక్షణ గోడను ఢీకొంది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో వంతెన గోడ కూలింది. టిప్పరు కిందకి పడి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలకు వంతెనపై లారీలు తిరగడంతో ఇసుక, బురద ఉండడంతో వాహనం అదుపు తప్పి ప్రమాదం జరిగిందని అంటున్నారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

సారవకోట: తుఫాన్‌పై అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం సూచించారు. శుక్రవారం ఆయన మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎటువంటి సమస్య ఎదురైనా మండల స్థాయి అధికారులకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

కొత్తూరు: మండలంలోని నివగాం రోడ్డు నందు స్థానిక ఎస్ఐ ఎంఏ అహ్మద్ శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా ఒడిశా నుంచి వస్తున్న బస్సులతో పాటు ఇతర వాహనాలను తనిఖీ చేశారు.

ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవ్వాలి

పొందూరు: విద్యార్థులు రాసిన పరీక్షలకు సంబంధించిన మార్కులకు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి సూచించారు. మండలంలోని రాపాక, తోలాపి జెడ్పీ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

8 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

హిరమండలం: మండలంలోని చొర్లంగి గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఎనిమిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మహ్మద్ యాసిన్ తెలిపిన వివరాలు ప్రకారం .. చొర్లంగి గ్రామ సమీపంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో శుక్రవారం దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,910 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీ హెల్పర్‌పై విచారణ

సరుబుజ్జిలి: మండలంలోని కూనజమ్మన్నపేట అంగన్‌వాడీ హెల్పర్‌పై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో శుక్రవారం విచారణ నిర్వహించామని ఐసీడీఎస్ సరుబుజ్జిలి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.రత్నాంజలి తెలిపారు. విచారణకు కొంతమంది హాజరు కాలేదని, పూర్తిస్థాయిలో శనివారం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సాగునీరు అందజేయాలి

బూర్జ: మండలంలోని పంట భూములకు సాగునీరు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటలను శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు సోషల్ ఆడిట్

సారవకోట: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన నిధులకు సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణ మోహన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో డ్వామా ఎఫ్ఎం స్వరూపరాణి అధ్యక్షతన సోషల్ ఆడిట్ కో-ఆర్డినేషన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఎస్ఆర్పీ పున్నపు నాయుడు, ఏపీవో నారాయణరావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రీయ సాగుపై అవగాహన

సారవకోట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సేంద్రీయ సాగు విధానంపై సంబంధిత సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 28 సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరయ్యాయి. ఈ కేంద్రాల్లో సేంద్రీయ పద్ధతుల ద్వారా పోషణ వాటికలు ఏర్పాటు చేసేందుకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, పద్మ, సుమలత, సీతారత్నం, సునీత పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని కవిటి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టామని వైస్ ఎంపీపీ తలసముద్రం కుమారి తెలిపారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు సూచనలు మేరకు డ్రైనేజీలో పూడికలను తొలగించి గ్రామానికి దూరంగా తరలించామన్నారు. తాగునీటి కుళాయిలు, బోర్లు వద్ద పరిశుభ్రం చేశామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు తలసముద్రం శోభన్‌బాబు ఉన్నారు.

అపార్ అప్‌డేషన్ వేగవంతం చేయాలి

జలుమూరు: అపార్ అప్‌డేషన్ వేగవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారులు బి.మాధవరావు, ఎంఈఆర్ ప్రసాదరావులు సూచించారు. శుక్రవారం ఎమ్మార్సీలో అన్ని పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

సత్వరమే పనులు పూర్తి చేయాలి

సరుబుజ్జిలి: సీసీ రోడ్లు, కాలువల పనులు సత్వరమే ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో ఎం.పావని స్పష్టం చేశారు. మండలంలోని కొత్తకోట గ్రామ పంచాయతీకి మంజూరైన పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యత ప్రకారం నిర్వహించాలని సూచించారు.